కన్నీటి కష్టాలు

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్పడం తప్ప ఆచరణలో విఫలమయ్యారు. మార్చి నెల పూర్తి కాకుండానే పలు గ్రామాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. చేతి బోర్లు పనిచేయడం లేదు. తాగునీటి పథకాలు మరమ్మతులకు గురయ్యాయి. నీటి కోసం గ్రామస్తులు బిందెలు చేతపట్టుకుని వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. కరెంటు కోతలు మొదలుకావడంతో నీటికోసం తిప్పలు తప్పడం లేదు.

- పని చేయని చేతిబోర్లు
- మరమ్మతులకు నోచుకోని తాగునీటి పథకాలు
- మార్చిలోనే తప్పని తాగునీటి కష్టాలు
- పట్టించుకోని అధికారులు


రాజుపాలెంలో తాగునీటి కోసం బిందెలతో వేచి వున్న గ్రామస్తులు

పెళ్లకూరు: మండలంలోని 56 గ్రామాల్లో 327 తాగునీటి బోర్లు, 18 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు, 53 చిన్న నీటి పథకాలు, రాజీవ్ టెక్నాలజీ మంచినీటి పథకాలు ఉన్నాయి. వీటిలో 95 శాతానికి పైగా తాగునీటి బోర్లు, సగానికిపైగా మినీ వాటర్ పథకాలు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో గ్రామాల్లో తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. చిల్లకూరు అరుంధతి కాలనీకి తాగునీటిని సరఫరా చేసి సుమారు పది మాసాలు అవుతోందని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో మూడు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు ఉన్నప్పటికీ తాగునీరు అందడం లేదని వాపోతున్నారు. స్వర్ణముఖి నదిలో ఉన్న మంచినీటి పథకాలు మరమ్మతులకు గురికావడంతోనే సమస్య మొదలైందని, అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పక్కనే ఉన్న జీలపాటూరు గ్రామానికి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. అదేవిధంగా చిల్లకూరు, రాజుపాళెం, మోదుగులపాళెం, వడ్డిపాళెం, నందిమాల, తాళ్వాయిపాడు, కానూరు తదితర గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ప్రజలు వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. దీనికితోడు కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక పనులు వదులుకుని ఎదురు చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చెంబేడులో శ్మశాన వాటిక వద్ద ఉన్న బోరు నుండి తాగునీరు తీసుకెళుతున్న స్థానికులు

దాహం తీర్చని పథకాలు

ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంజూరు చేసిన నిధులు మూలుగుతున్నాయి. మండలంలో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులను ఒక కాంట్రాక్టరే తీసుకున్నారు. ఆయన పలుచోట్ల పనులను అసంపూర్తిగా వదిలేశారు. పనుల్లో కూడా నాణ్యత లోపించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా జరుగుతుందోని చెబుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వ్యవసాయ బోర్ల నుంచి తాగునీరు తీసుకు వెళుతున్న అరుంధతి కాలనీ మహిళలు

ఇంటింటికి తాగునీరు సరఫరా చేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. మార్చి నెలకే తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు ఇంకా పెరుగుతాయి. అధికారులు, పాలకులు స్పందించి ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలి. ఇంటింటికీ తాగునీరు అందించేలా చూడాలి.

– వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ, పెళ్లకూరు

తిప్పలు తప్పడం లేదు



మా గ్రామంలో వున్న మంచినీటి పథకాలు సక్రమంగా పని చేయడం లేదు. దీంతో తాగునీరు సరఫరా కావడం లేదు. చేతిబోర్లు తుప్పుపట్టి నిరుపయోగంగా మారాయి. నీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. కరెంటు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందదో తెలియక పడిగాపులు పడాల్సి వస్తోంది. అధికారులు తగిన చర్యలు తీసుకుని నీటిని ఇవ్వాలి.

– రాఘవయ్య, నందిమాల


ఆటోలో తాగునీరు తీసుకెళుతున్న దృశ్యం

కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఛీకొడుతున్నారు


నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

– నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఛీదరించుకుంటున్నారని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆయన బుధవారం వాకాడులోని తన నివాసంలో వాకాడు, కోట, చిట్టమూ రు మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అధికార అండతో కూటమి నాయకులు అధికారం దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. వారి ఒత్తిళ్లకు ఎవరూ భయపడొద్దన్నారు. పేద ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. అన్ని వర్గా ల వారినీ నిలువునా మోసం చేసిందన్నారు. కూట మి ప్రభుత్వ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీకి మంచి రోజులు వస్తున్నాయని, జమిలి ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రానున్నామని జోస్యం చెప్పారు. నాయకులు, కార్యకర్తలకు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోపా టు తాను అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వాకాడుకు చెందిన షేక్ గౌస్‌బాషా కుటుంబ సభ్యులను పరామర్శించారు. గౌస్‌బాషా భార్య అనీఫా ఇటీవల మృతి చెందారు. కార్యక్రమంలో నాయకులు కొడవలూరు దామోదర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవి, నాగూర్‌రెడ్డి, పెంచలరెడ్డి, సుధాకర్‌నాయుడు, వెంకటేశ్వర్లురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ జాతర చాటింపు పూజలు

- మే 6, 7 తేదీల్లో పోలేరమ్మ జాతర
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు


పోలేరమ్మ జాతర చాటింపు పూజలు చేస్తున్న పెద కాపు శ్రీనివాసులు రెడ్డి తదితరులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతరను మే 6, 7 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు జాతర మొదటి చాటింపు పూజలను మంగళవారం అర్ధరాత్రి ఆలయ ఈవో రవికృష్ణ, విన్నమాల గ్రామ పెద కాపు అరవ భూమి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. నానబాల సుబ్బారావు, నల్లబోతులు రామారావు, ఆకులు కుబేరు మణి, దేవతా కిషోర్ శెట్టి, మెస్ భాస్కర్ రెడ్డి, గుంటూరు లక్ష్మయ్య, రమణయ్య నాయుడు, జువ్వలపాటి మస్తాన్, మదిరి జలంధర్ తదితరులు చాటింపు పూజల్లో పాల్గొన్నారు. మొదటగా అమ్మవారి పుట్టినిల్లు అయిన పడమటి వీధిలోని కుమ్మరిమిట్టలో పోలేరమ్మ మట్టి విగ్రహాన్ని తయారు చేసుకుని మెట్టినిల్లు అయిన శెట్టిపల్లివారి వీధిలోకి తీసుకువచ్చి అలంకరించారు. తర్వాత బజారు నడి వీధిలో అమ్మణ్ణికి కుంభం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి విన్నమాలతో పాటు నాయుడుపేట పట్టణానికి చెందిన అనేకమంది భక్తుల కిలారింపుల నడుమ అమ్మవారి మట్టి ప్రతిమను మార్కెట్ సమీపంలో వారధి వద్దకు తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. మొదటి చాటింపు అనంతరం జాతరను మే 4న ఘటం, 6వ తేదీ రాత్రి అమ్మవారి ఊరేగింపు, 7వ తేదీ తెల్లవారుజామున ఆలయం వద్ద అమ్మవారి నిలుపు, రాత్రి అమ్మవారి ఊరేగింపు నిమజ్జనంతో జాతర ముగుస్తుందని అధికారులు తెలిపారు. ఆలయ పూజారి సురేష్ జాతర నిర్వహణ చేపట్టే వివిధ వర్గాల వారు, విన్నమాల గ్రామస్తులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి


గర్భిణులతో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ సభ్యులు

ఓజిలి: విలేజ్ హెల్త్ క్లినిక్కులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన బుధవారం ఆర్మేనిపాడు విలేజ్ హెల్త్ క్లినిక్కును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని గర్భిణులకు వైద్య పరీక్షలు చేయడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించాలన్నారు. 5 ఏళ్లలోపు పిల్లలు, బాలికల ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు మాధవ్, వినిషా, డీఎస్‌వో నాగేంద్ర, డీపీవో ప్రకాష్, హెల్త్ అసిసెంట్లు కన్నా వెంకటరమణయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘9న టీడీపీకి తగిన శాస్తి జరుగుతుంది’


మున్సిపల్ కౌన్సిలర్లతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : మున్సిపల్ చైర్మన్ ఎంపికకు సంబంధించి ఈనెల 9వ తేదీన జరగనున్న అవిశ్వాసంలో టీడీపీ అభాసుపాలవుతుందని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు బెదిరే సమస్యే లేదన్నారు. నక్కా భానుప్రియను చైర్‌పర్సన్‌గా కొనసాగించేందుకు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు దృఢ నిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. అధికారాన్ని ఉపయోగించి చైర్ పర్సన్ పీటాన్ని దక్కించుకోవడానికి కూటమి ప్రభుత్వం, నాయకులు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వారికి 9వ తేదీన తగిన శాస్తి జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, పార్టీ పట్టణ కన్వీనర్ పులిప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు


బస్సు కింద ఇరుక్కుపోయిన బైక్

కోట: మండల కేంద్రమైన కోటలో బుధవారం బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో రైతు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. సూళ్లూరుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో తూర్పుకనుపూరుకు వెళుతోంది. కొక్కుపాడు రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్ద బైక్‌ను ఢీకొంది. బైక్ నడుపుతున్న అగ్రహారం గ్రామానికి చెందిన రైతు విమలాకర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. బైక్ బస్సు ముందు చక్రం కింద ఇరుక్కుపోయింది. స్థానికులు అతన్ని 108లో కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి నెల్లూరు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి నెల్లూరులో చికిత్సలు


నిందితుడు సత్యనారాయణ

నాయుడుపేట టౌన్: నెల్లూరుకు చెందిన ప్రముఖ డాక్టర్ బిందుమీనన్‌ను మోసం చేసి రూ.60 లక్షలు స్వాహా చేసిన నాయుడుపేటకు చెందిన వి.సత్యనారాయణ అస్వస్థతకు గురికావడంతో పోలీసులు అతన్ని నెల్లూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నిందితుడు వైద్యురాలికి ఆధునిక వైద్య పరికరాలు ఇస్తామని చెప్పి రూ.60 లక్షలు తీసుకున్నాడు. పరికరాలు ఇవ్వకపోవడంతో ఆమె నగదు తిరిగి ఇవ్వాలని అడిగింది. దీంతో అతను తనకు ఇన్‌కమ్ ట్యాక్స్ సెంట్రల్ విజిలెన్స్ అధికారులు బాగా తెలుసని బెదిరించడంతోపాటు దౌర్జన్యం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని మంగళవారం అరెస్టు చేశారు. అనంతరం గూడూరులో జడ్జి ఎదుట హాజరుపరిచారు. అతను న్యాయమూర్తి ఎదుట తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతన్ని ఆస్పత్రిలో చేర్చాలని జడ్జి పోలీసులను ఆదేశించారు. ఈ క్రమంలో నిందితుడిని నెల్లూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. నిందితుడు సత్యనారాయణ నాయుడుపేటలోని ప్రముఖ డాక్టర్ భర్త కావడం, పలుకుబడి ఉన్న వ్యక్తి కావడంతో జైలుకు వెళ్లకుండా తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరాడని, బెయిల్ మంజూరు చేయించుకుని నేరుగా ఇంటికి వెళ్లేందుకు పథకం పన్నినట్టు సమాచారం. ఈ విషయమై నాయుడుపేట అర్బన్ సీఐ బాబిని వివరణ కోరగా నిందితుడు న్యాయమూర్తి ఎదుట అస్వస్థతకు గురికావడంతో పోలీసు బందోబస్తు నడుమ నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. అతని ఆరోగ్యం కుదుటపడినట్లు వైద్యులు తెలిపిన వెంటనే కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


రూ.లక్ష విరాళం ఇస్తున్న దాతలు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలో వెలసిన శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ బ్రాంచి మేనేజర్ రవికుమార్ దంపతులు బుధవారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈవో ప్రసన్నలక్ష్మికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బైరి పార్థసారథిరెడ్డి, పొన్నా కాటయ్య పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్


దువా చేస్తున్న ఎమ్మెల్యే తదితర నాయకులు

నాయుడుపేట టౌన్ : మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ అని, ముస్లింలు కఠిన నియమాలతో ఉపవాస దీక్షలు ఉంటారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజ యశ్రీ తెలిపారు. ఆమె బుధవారం రాత్రి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పార్థసారథితో కలిసి జామియా మసీదు షాదీ మంజిల్ వద్ద నెలవల రాజేష్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు చెప్పినట్టుగా రంజాన్ పండుగ తోఫాను వచ్చే ఏడాది నుంచి ఇస్తామన్నారు. నాయుడుపేటలోని ముస్లింలకు బక్రీద్ పండుగ నాటికి ఈద్గా కోసం స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అంతకుముందు ఆమెను మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, మత పెద్దలు ముస్లిం సంప్రదాయం ప్రకారం ఘనంగా సత్కరించారు. హాజీ రహమత్ బాష దువా చదివి ఆశీకర్వదించారు. శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, ఉయ్యాల ప్రవీణ్ కుమార్, సన్నారెడ్డి చంద్రారెడ్డి, చేవూరి చెంగయ్య, జామియా మసీదు ముతవల్లి హాజీ రహంతుల్లా, హాజీ నిజాం, సుభహాని, రషీద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనుల పండువగా గ్రామోత్సవం


గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

చిట్టమూరు మండలంలోని ఆరూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి గ్రామోత్సవాన్ని బుధవారం తెల్లవారుజామున కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ఆరోవార్షికోత్సవంలో భాగంగా స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. తర్వాత ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

సైదాపురం: ప్రజాదర్బార్ కార్యక్రమంలో వచ్చిన ప్రతి సమస్యకూ సత్వరం పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్‌నాయుడు, సుబ్రమణ్యం రాజు, మోహన్‌కృష్ణారెడ్డి, సుబ్రమణ్యం నాయుడు, దిలీప్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అంబలి పంపిణీ


భక్తులకు అంబలి పంపిణీ చేస్తున్న వ్యాపారులు

కోట: కనుపూరుకు వెళ్లే భక్తులకు బుధవారం విద్యానగర్‌లో వ్యాపారులు అంబలి పంపిణీ చేశారు. జాతరకు వెళ్లే భక్తులతో రోడ్లన్నీ కిటకిటలాడాయి. భక్తులకు ఆకలి తీర్చేందుకు విద్యానగర్‌లో వ్యాపారులు కలిసి అంబలి పంపిణీ కేంద్రం ఏర్పాటుచేశారు. సుదూర ప్రాంతాల నుంచి విద్యానగర్, కోట మీదుగా కనుపూరుకు వెళ్లే భక్తులు ఇక్కడ ఆగి అంబలి తాగి వెళ్లారు.

డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్


రాపూరు డిగ్రీ కళాశాలకు ఆడిట్ రిపోర్టును అందజేస్తున్న అధికారులు

రాపూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం డైరెక్టరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు 2023–24, 2024–25 సంవత్సరాలకు సంబంధించి అకడమిక్ ఆడిట్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ హనుమంతయ్య తెలిపారు. అకడమిక్ అడ్వైజర్లుగా నాయుడుపేట డిగ్రీ కళాశాల నుంచి వాసప్ప, వెంకటగిరి విశ్వోదయ డిగ్రీ కళాశాల నుంచి మంజునాథ్‌రెడ్డి హాజరయ్యారని తెలిపారు. వారు రెండు సంవత్సరాల్లో కళాశాలలోని విద్యా ప్రమాణాలు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. కళాశాలకు బీ సర్టిఫికెట్ అందజేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపునకు అధ్యాపకులు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

నవోదయకు టీఎమ్మార్ విద్యార్థుల ఎంపిక


పవన్ జోషిత, ఇషా దీక్షిత

చిట్టమూరు : జవహర్ నవోదయ విద్యాలయానికి ఇద్దరు విద్యార్థులు పవన్ జోషిత్, ఇషా దీక్షిత ఎంపికై నట్టు కొత్తగుంటలో ఉన్న టీఎమ్మార్ స్కూల్ కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి తెలిపారు. వారిని ఆయన అభినందించారు. తమ పాఠశాలలో నవోదయలో ప్రవేశానికి సంబంధించి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు గోపాల్, రూపేష్, రవిని ఆయన అభినందించారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

సైదాపురం(కలువాయి): కలువాయి మండలం కేశమనేనిపల్లిలో బుధవారం ఈతకు వెళ్లి యువకుడు మైనింగ్ గుంతలో చిక్కుకుని మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. కేశమనేనిపల్లి గిరిజన కాలనీకి చెందిన ఏలూరు సుబ్బయ్య, వెంకటరమణయ్య పెద్ద కుమారుడు పెంచలప్రసాద్(17) ఓ ప్రైవేటు పాఠశాలలో వాహన క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఒంటిపూట బడులు కావడంతో స్కూల్ పిల్లలను దించి ఇంటికి వచ్చాడు. అనంతరం ముగ్గురు స్నేహితులతో కలిసి కాలనీ సమీపంలోని మైకా క్వారీ గుంతలో ఈతకు వెళ్లాడు. అతను ఎంతకూ పైకి రాకపోవడంతో స్నేహితులు గాలించారు. వారి ప్రయత్నం విఫలమైంది. ఈ విషయాన్ని వారు ప్రసాద్ కుటుంబ సభ్యులతోపాటు, గ్రామస్తులకు తెలిపారు. స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. పెంచల్‌ప్రసాద్ మృతదేహం గుంతలో చిక్కుకుని ఉన్నట్లు గుర్తించారు.

రేపు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

గూడూరు రూరల్ : గూడూరు రెండో పట్టణ సమీపంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కె.శివప్రసాద్ తెలిపారు. శ్రీసిటీ, తిరుపతిలోని ఏసీ, టూత్ బ్రష్‌ల తయారీలో పేరుగాంచిన ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగాల కోసం బ్లూ ఓషన్ పర్సనల్ అండ్ అల్‌లెడ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నేస్తం కన్సల్టెన్సీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేస్తారని తెలిపారు. 350 పురుషులు, మహిళలకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదివిన వారు అర్హులన్నారు.

రేషన్ కార్డుదారుల ఈకేవైసీ చేయించాలి

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలంలోని తెల్లరేషన్ కార్డుదారులతో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలని తహసీల్దార్ శ్యామ్ సుందర్‌రెడ్డి తెలిపారు. రేషన్ డీలర్లు, వీఆర్వోలు సమన్వయంతో పనిచేసి సకాలంలో ఈకేవైసీని పూర్తి చేయాలన్నారు.

అపరాధ రుసుంలో 50 శాతం రాయితీ

వెంకటగిరి రూరల్ : 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను, పాత బకాయిల చెల్లింపులో ఈ నెల 31వ తేదీ వరకు అపరాధ రుసుంలో 50 శాతం రాయితీ ఇస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాయుడుపేట టౌన్ : ఈ నెల 31వ తేదీలోపు ఆస్తి, నీటి పన్నులు చెల్లించి వడ్డీలో 50 శాతం రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ షేక్ షజులుల్లా తెలిపారు. బకాయిలు, ఆస్తి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు ఒకేసారి చెల్లించిన వారికి ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటించినట్లు తెలిపారు.

‘భూమిని ఆక్రమిస్తున్నారు.. న్యాయం చేయండి’

గూడూరు రూరల్ : ‘నేను సాగు చేసిన పంటను ధ్వంసం చేయడంతోపాటు భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. న్యాయం చేయండి’ అని గూడూరు రూరల్ మండలంలోని పోటుపాళెంకు చెందిన వేణుంబాక రమణారెడ్డి వాపోయారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. తనకు తూర్పు గూడూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1889, 1890, 1891లలో 13.33 ఎకరాల భూమి ఉందన్నారు. అందులో పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నానని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కొందరు తన భూమిని ఆక్రమించుకోవడంతోపాటు తనపై దౌర్జన్యానికి దిగుతున్నారని తెలిపారు. ఈ విషయమై రూరల్ పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని వాపోయారు. కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా దౌర్జన్యం చేస్తున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తన భూమిని అక్రమార్కుల నుంచి కాపాడి న్యాయం చేయాలని కోరారు.

గ్రావెల్ అక్రమ రవాణా



కలువాయి(సైదాపురం): కూటమి ప్రభుత్వం వచ్చాక కలువాయి మండలంలో అన్నీ గ్రామాల్లో గ్రావెల్ అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మాదన్నగారిపల్లి మజరా గ్రామమైన రామన్నగారిపల్లిలో కండలేరు కాలువ ఆనకట్ట నుంచి గ్రావెల్ తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ గ్రావెల్‌ను రూ.700 నుంచి రూ.1000 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చలివేంద్రం

వాకాడు : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలన

దక్కిలి : మండలంలోని దేవునివెల్లంపల్లి పంచాయతీలోని వెంకటేశ్వరపురం ఎస్టీ కాలనీ పాఠశాలను బుధవారం ఎంఈవో–2 పి.జగదీష్‌బాబు తనిఖీ చేశారు. విద్యార్థులు సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్నం మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. హెచ్ఎం దూడల పెంచలయ్య, ఉపాధ్యాయుడు పి.తేజోవర్మ పాల్గొన్నారు.